సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 14 । ఆగస్టు । 2023



రిమ్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

రిమ్స్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. వైద్యకోర్సు పూర్తి చేసిన 2017 బ్యాచ్ మెడికోలకు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. 8లో▸



లక్కేరావు మృతి తీరని లోటు

లక్కేరావు మృతి ఆదివాసీ సమాజానికి తీరని లోటని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ లక్కేరావు సంతాప సభ ఉట్నూర్‌లో నిర్వహించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేంద్రమంత్రిని కలిసిన జిల్లా నాయకులు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో జిల్లా నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా చూడాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని బీజేపీ రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కేంద్ర మంత్రిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు నల్ల రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ, ఐఆర్‌పై కాలయాపన చేస్తుందన్నారు. ఇందులో సంఘం నాయకులు నారాయణరెడ్డి, ప్రభాకర్‌రావు, రవీందర్‌రెడ్డి, గణేశ్, రవీందర్ రావు తదితరులు ఉన్నారు.

అమర సైనికుల త్యాగాలు చిరస్మరణీయం



తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఆదిలాబాద్: సైనిక అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయం నుంచి వినాయక్ చౌక్ వరకు జాతీయ పతాకాలతో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. జాతీయ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరుల త్యాగాల పునఃస్మరణ కోసమే దేశవ్యాప్తంగా మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జోగు రవి, ప్రవీణ్, సోమ రవి, రఘుపతి, మయూర్ చంద్ర, శివ, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సదస్సులో జిల్లా నాయకులు



రాష్ట్ర సదస్సులో జిల్లా నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులు భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో కొనసాగుతున్నాయి. ఇందులో విద్యారంగ సమస్యలపై చర్చించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్ తెలిపారు. యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇందులో రాకేశ్, మహేందర్, నవీన్, సికిందర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల పెండింగ్ వేతనాలు చెల్లించా లని దుర్గం సొసైటీ చైర్మన్ దు ర్గం శేఖర్‌ను మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరా రు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. 2014లో 48 మంది సెక్యూరిటీ గార్డులు ఐదు నెలల పాటు పనిచేశారని, వారి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్, ముజీబ్, నవీన్, శంకర్ పాల్గొన్నారు.

రైతులకు ఉపకరణాల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని లోటస్ సేవ కేంద్రం ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ (సీఎస్ఆర్) కింద 300 మంది రైతులకు ఆదివారం ఉపకరణాలు పంపిణీ చేశారు. ఇందులో మేనేజర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న వైద్యుడు

విస్తరిస్తున్న కుష్ఠు

- తగ్గుముఖం పట్టని వ్యాధి
- ఈనెల 16 నుంచి పక్షోత్సవాలు
- ఇంటింటికీ వెళ్లి నిర్ధారణ పరీక్షలు
- కేసులు పెరిగే అవకాశం

వ్యాధిగ్రస్తుల వివరాలు..

సంవత్సరం	గుర్తించిన వ్యాధిగ్రస్తులు
2017	60
2018	47
2019	43
2022	17
ఈ ఏడాది ఇప్పటి వరకు.. 57	



ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కుష్ఠు చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాపించే అంటు వ్యాధి కావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడం, సరైన సమయంలో గుర్తించకపోవడంతో రోజురోజుకు వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వ్యాధి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ ఆచరణలో కనిపించడం లేదు. బాధితులు సకాలంలో చికిత్స తీసుకోకపోవడంతో దుష్పరిణామాలు ఎదురవుతున్నాయి. తీవ్రత పెరిగి వైకల్యం బారిన పడుతున్నారు. కాగా, ఈనెల 16 నుంచి 31వరకు జిల్లాలో వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో కుష్ఠు వ్యాధి తగ్గుముఖం పట్టడం లేదు. వ్యాధిగ్రస్తులను ఆరు నెలల్లోపు గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆరు నెలల్లోపు గుర్తించిన వారు జిల్లాలో ప్రస్తుతం ముగ్గురు ఉండగా.. ఏడాది తర్వాత గుర్తించిన వారు 54 మంది ఉన్నారు. ఇంకా వ్యాధి నిర్ధారించుకోని వారు వందల సంఖ్యలో ఉంటారని తెలుస్తోంది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా గుర్తింపు సరిగా జరగడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా ఇతరులకు వ్యాప్తి చెందడం ద్వారా రోగుల సంఖ్య పెరుగుతుంది. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు వ్యాధిగ్రస్తులను గుర్తించి సంబంధిత పీహెచ్‌సీలకు పంపించాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోంది. పీహెచ్‌సీల వారీగా చూస్తే.. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలి పీహెచ్‌సీ పరిధిలో అత్యధికంగా 11 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు. గుడిహత్నూర్‌లో 4, ఇచ్చోడలో 3, బజార్‌హత్నూర్‌లో 7, సొనాలలో 2, నేరడిగొండలో 1, తాంసిలో 5, ఇంద్రవెల్లిలో 3, ఝరిలో 2, భీంపూర్(టి)లో 2, తలమడుగులో 2, జైనథ్‌లో 2, బేలలో 1, హస్నాపూర్, దంతన్‌పల్లి, శ్యామ్‌పూర్, ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ పుత్లీబౌళి, హమాలివాడలలో ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. అలాగే ఖుర్షీద్‌నగర్ పీహెచ్‌సీ పరిధిలో ఐదుగురు ఉన్నారు. ఆయా మండలాల పరిధిలో 49 మంది ఉండగా, ఆదిలాబాద్ పట్టణంలో 8 కేసులు ఉన్నాయి.

తొలి దశలో చికిత్స తీసుకుంటే..

కుష్ఠు మైకో బ్యాక్టీరియా లెప్రీ అనే బ్యాక్టీరియాతో సోకుతుంది. శరీరంలోని అన్ని అవయవాలకు వస్తుంది. సకాలంలో వైద్యం చేయించుకోకపోతే ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన తర్వాత 3 నుంచి15 సంవత్సరాల తర్వాత దుష్పరిణామాలు బయటపడుతాయి. తొలిదశలో వ్యాధిని నిర్ధారించుకొని ఎండీటీ చికిత్స పొందితే అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చు. శరీరంలో ఎరుపు రంగు, రాగి రంగు స్పర్శ లేని మచ్చలు ఉంటే వ్యాధిగా గుర్తించవచ్చు. జిల్లాలో ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారు 57 మంది ఉండగా, పాత వ్యాధిగ్రస్తులు, అంగవైకల్యం కలిగిన వారు 267 మంది ఉన్నారు.

ఇంటింటా సర్వే..

కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం- 2023 కార్యక్రమంలో భాగంగా ఈనెల 16 నుంచి 31 వరకు జిల్లాలో వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వేకు శ్రీకారం చుడుతున్నారు. ఇందు కోసం జిల్లాలో 1006 మంది ఆశ కార్యకర్తలను, పర్యవేక్షణ కోసం 200 మంది సూపర్‌వైజర్లను నియమించారు. జిల్లా స్థాయిలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, కుష్ఠు నివారణ అధికారి పర్యవేక్షిస్తారు. అలాగే రాష్ట్రస్థాయి పరిశీలకులుగా డాక్టర్ ప్రదీప్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9.30 గంటల వరకు ఆశ కార్యకర్తలు సర్వే చేపడుతారు. గ్రామీణ ప్రాంతంలో 20, పట్టణ ప్రాంతంలో 25 కుటుంబాలను సర్వే చేస్తారు.

పకడ్బందీగా సర్వే ..

జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వేను పకడ్బందీగా చేపడతాం. ఈనెల 16 నుంచి 31 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. సర్వేలో భాగంగా ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి పరీక్షిస్తారు. అనుమానాలు ఉంటే సంబంధిత పీహెచ్‌సీలకు తీసుకెళ్లి పరీక్షలు చేయిస్తారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే కుటుంబ సభ్యులందరికీ వ్యాధి సోకే ప్రమాదం ఉంటుంది. – నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

అత్తారింటికొచ్చినా.. పిల్లలెదిగినా..

- రేషన్‌కార్డుల్లో నమోదవ్వని పేర్లు
- ఊసేలేని కొత్త కార్డుల జారీ
- మార్పులు, చేర్పులకూ నో చాన్స్
- అందని సర్కారు ప్రయోజనాలు
- అర్హులకు తప్పని ఎదురుచూపు



కైలాస్‌నగర్: దారిద్య్రరేఖకు దిగువన ఉన్నప్పటికీ రేషన్‌కార్డుల్లేక వేలాది మంది నిరుపేదలు ప్రభుత్వ ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. కార్డుదారుల్లో ఎవరైన మరణించినా, వ్యవసాయ భూమి ఎక్కువగా ఉన్నా అలాంటి వారి వివరాలు తక్షణమే కార్డుల నుంచి తొలగిస్తున్న ప్రభుత్వం.. కొత్తగా మార్పులు, చేర్పులకు మాత్రం అవకాశం ఇవ్వడం లేదు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులను జారీ చేయడం లేదు. దీంతో అర్హులైన వారికి ఎదురుచూపులు తప్పని పరిస్థితి. పెళ్లి చేసుకుని అత్తారింటికి వచ్చినవారు, పుట్టిన పిల్లలు ఎదిగి బడికి వెళ్లే వయస్సు వచ్చినప్పటికీ రేషన్‌కార్డుల్లో మాత్రం పేరు నమోదు కాకపోవడం గమనార్హం. రేషన్ బియ్యంతో పాటు సర్కారు అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ఎన్నికల వాతావరణం నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల వరాల జల్లు కురిపిస్తోంది. ఈక్రమంలో కొత్త రేషన్‌కార్డుల కోసం పలువురు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

ఏళ్లుగా ఎదురుచూపు

హుజురాబాద్ ఉపఎన్నిక నేపథ్యంలో 2021 జూలైలో ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డుల జారీ చేపట్టినా వాటిని పూర్తిస్థాయిలో అందించలేకపోయింది. జూలైకి ముందు వరకు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ప్రభుత్వం కార్డులు జారీ చేసింది. కొత్తవారికి నిరాశే మిగిలింది. మరోవైపు రేషన్‌కార్డులు ఉండి అందులో పేర్లు, చిరునామా మార్పులతో పాటు కొత్త సభ్యుల నమోదు కోసం ప్రభుత్వం అవకాశం కల్పించడం లేదు. వీటి కోసం వేలాది మంది మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

సంక్షేమ పథకాల లబ్ధికి దూరం

పెళ్లి చేసుకుని అత్తారింటికి వచ్చి ఏళ్లు గడుస్తున్నా కార్డు పొందలేని మహిళలు, పుట్టిన పిల్లల వివరాల నమోదు కోసం మార్పులు, చేర్పుల కోసం ఇప్పటికే వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే 2021లో అనర్హుల ఏరివేతకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కారు, బంగ్లా, మూడున్నర ఎకరాలకు మించి వ్యవసాయ భూమి ఉన్నవారిని గుర్తించి వారికున్న రేషన్‌కార్డులను రద్దు చేసింది. అయితే అర్హులైన వారికి మాత్రం కొత్తగా మంజూరు చేయడంలేదు. దీంతో ఇలాంటి వారు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు పొందలేకపోతున్నారు. రేషన్ బియ్యంతో పాటు ఆరోగ్యశ్రీ, ఆసరా పింఛన్, గృహలక్ష్మి, దళితబంధు, దళిత బస్తీ వంటి అనేక ప్రయోజనాలకు దూరమవ్వాల్సిన పరిస్థితి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలోనైనా ప్రభుత్వం కరుణించి రేషన్‌కార్డుల జారీ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మండలాల వారీగా ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తుల వివరాలు

మండలం	అందిన దరఖాస్తులు
ఆదిలాబాద్ అర్బన్	763
ఆదిలాబాద్ రూరల్	402
బజార్‌హత్నూర్	364
బేల	255
భీంపూర్	157
బోథ్	290
గాదిగూడ	400
గుడిహత్నూర్	276
ఇచ్చోడ	74
ఇంద్రవెల్లి	380
జైనథ్	487
మావల	249
నార్నూర్	46
నేరడిగొండ	39
సిరికొండ	111
తలమడుగు	305
తాంసి	125
ఉట్నూర్	340

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు

కొత్త రేషన్‌కార్డుల జారీని ప్రభుత్వం నిలిపివేసింది. అయితే కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులతో విచారణ జరిపించి వివరాలు సిద్ధంగా ఉంచాం. ప్రభుత్వం వాటిపై ఎప్పుడు ఆదేశాలు జారీ చేస్తే తదనుగుణంగా చర్యలు తీసుకుంటాం.
– టి.కిరణ్‌కుమార్, జిల్లా పౌరసరఫరా అధికారి

సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఖానాపూర్: వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంజాల వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సెక్యూరిటీ గార్డుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. జీవో 21ని వెంటనే అమలు చేయాలని, ఏకరూప దుస్తులు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు సంఘం ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీ చంటి, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాడి గంగారాం, జీ పొచ్చన్న, నిర్మల్ అధ్యక్ష, కార్యదర్శులు షోయబ్ హుస్సేన్, బీ గంగాధర్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల అధ్యక్షుడు పీ రమేశ్, కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు షేక్ ఫహీం, కరిపె రాజేందర్, పోశెట్టి, జనార్దన్, వెంకన్న, రమేశ్, నిరంజన్ తదితరులున్నారు.

అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లు వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘం ఐక్య కార్యాచరణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో పీజీహెచ్ఎం, టీయూటీఎఫ్, టీపీయూఎస్, టీఆర్‌టీఎఫ్, ఎస్టీయూ, టీఎస్‌పీటీఏ, ఎస్జీటీయూ, టీఎస్ టీటీఎఫ్ తదితర సంఘాల నాయకులు ఆదివారం సమావేశం అయ్యారు. అనంతరం డీఈవో ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సర్దుబాటు ప్రక్రియ చేపట్టలేదని పేర్కొన్నారు. ఓరల్ డిప్యూటేషన్లు వెంటనే రద్దు చేసి వారు పనిచేస్తున్న పాఠశాలకు పంపించాలని కోరారు. సమావేశంలో సూర్యకాంత్, శ్రీకాంత్, జలేందర్ రెడ్డి, సునీల్‌చౌహాన్, వృకోదర్, అశోక్ కుమార్, శివకుమార్, విఠల్, రియాజ్, వెంకటేశ్, నరేశ్ పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గందరగోళంగా కేజీబీవీ నియామకాలు

- అవకతవకలు చోటు చేసుకున్నాయని అభ్యర్థుల ఆరోపణ

ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాత పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు రెండు, మూడు రోజులుగా నియామక ప్రక్రియ చేపడుతున్నారు. సీఆర్టీ, పీజీ సీఆర్టీ, నర్సింగ్ పోస్టులకు సంబంధించి తుది జాబితాలో ఎంపికైన అభ్యర్థులకు ఆదివారం పోస్టింగ్ కల్పించారు. డీఈవో ప్రణీత వారికి నియామక పత్రాలు అందజేశారు. అయితే రోస్టర్‌లో అవకతవకలు చోటు చేసుకున్నాయని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. అర్హులను కాకుండా అనర్హులకు పోస్టింగ్ ఇచ్చేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టారీతిన కౌన్సెలింగ్ చేపడుతున్నారని ఆవేదనకు గురయ్యారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో సర్టిఫికెట్లను పరిశీలన చేయని అభ్యర్థులకు సైతం తుది జాబితాలో ఏవిధంగా చోటు కల్పిస్తారని అధికారులను ప్రశ్నించారు. పీజీ సీఆర్టీ కెమిస్ట్రీ పోస్టులో మొదట బయోసైన్స్ అభ్యర్థులను ఎంపిక చేస్తూ జాబితా ప్రకటించారు. తర్వాత బీఎడ్ మెథడాలజీలో ఫిజికల్ సైన్స్ వారు చదవలేదని మధ్యాహ్నం తర్వాత వారి పేర్లను తొలగించడంతో గందరగోళ పరిస్థితికి దారి తీసింది. ఎంపికైన తర్వాత అధికారులు తమ పేర్లను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు రాత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు ఫిజిక్స్ మెథడాలజీ ఉన్నవారికి కెమిస్ట్రీ పోస్టులను కేటాయించారు. ఈ విషయమై డీఈవో ప్రణీతను వివరణ కోరగా.. ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. మొత్తం 68 పోస్టులకు గాను 62 పోస్టులు భర్తీ చేశామని, మిగతా ఆరు పోస్టులకు గాను ఆయా కేటగిరిలో అభ్యర్థులు లేకపోవడం, కొందరు నాట్ విల్లింగ్ ఇవ్వడంతో ఆ పోస్టులు భర్తీ కాలేదని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన అభ్యర్థినికి నియామక పత్రం అందజేస్తున్న డీఈవో ప్రణీత

నేడు ఫొటో ఎగ్జిబిషన్

ఆదిలాబాద్: 'ఆజాదీకా అమృత్ మహోత్సవం'లో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిజామాబాద్ యూనిట్ ఆధ్వర్యంలో తెలుగు స్వాతంత్య్ర సమరయోధుల ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ కె.శ్రీనివాస్‌రావు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఉదయం 10 గంటలకు ఈ ఎగ్జిబిషన్‌ను ఎంపీ సోయం బాపూరావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రదర్శన మూడు రోజుల పాటు ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న 'డివిజన్ సాధన' దీక్ష

బోథ్: బోథ్ డివిజన్ చేయాలని డిమాడ్ చేస్తూ చేపట్టిన దీక్ష 28వ రోజుకు చేరింది. ఆదివారం దీక్షలో స్థానిక ప్రభుత్వ పాఠశాల 1997 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కూర్చున్నారు. అక్కడే వంటావార్పు చేపట్టారు. ఎన్నికల ముందే బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలని కోరారు. దీక్షలకు రిటైర్డ్ జిల్లా జడ్జి శ్యామ్ మోహన్‌రావు దేశ్‌పాండే, బార్ అసోసియేషన్ సభ్యులు సంఘీభావం ప్రకటించారు.



దీక్షలో కూర్చున్న ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

క్లుప్తంగా

బాసరలో భక్తుల రద్దీ



బారులు తీరిన భక్తులు

భైంసా: బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆదివారం సెలవు దినం కావడంతో మహారాష్ట్రతోపాటు తెలంగాణ నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాగణంలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు గోదివరి నదిలో పుణ్యస్నానాలు అచరించి తెప్పలు వదలి మొక్కలు చెలించుకున్నారు.

కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య

తలమడుగు: కడుపునొప్పి భరించలేక బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ధనశ్రీ కథనం ప్రకారం.. మండలంలోని లాల్‌ఫుడ గ్రామానికి చెందిన కుడిమేత శైలజ (16) గత ఆరునెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతోంది. ఇటీవల శస్త్రచికిత్స చేసుకున్నా కడుపునొప్పి తగ్గలేదు. దీంతో మనస్తాపంతో ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. శనివారం రాత్రి పక్కా సమాచారంతో పేకాటస్థావరంపై దాడి చేసి ఐదు బైక్‌లు, వారి వద్ద రూ.12,900 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ఆటోబోల్తా

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతంలో జాతీయ రహదారిపై ఆదివారం ఆటోబోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. కూలీలు తమ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా బోల్తా పడింది. గాయపడిన వారిని స్థానికులు రిమ్స్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్సైని ‘సాక్షి’సంప్రదించగా ఆటో బోల్తా పడిన విషయం వాస్తవమేనని, ఇంకా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

బెజ్జూర్(సిర్పూర్): అడవిపంది దాడిలో ఒకరు గాయాలపాలైన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పెద్ద సిద్దాపూర్ గ్రామానికి చెందిన మేస్త్రం సాంబయ్య పంటచేనుకు వెళ్లి వస్తుండగా గొల్లబాయి చెరువు సమీపంలో అడవిపంది దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో అడవిపంది పారిపోయింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

గంజాయి మత్తులో యువత

బోథ్ మండలంలో గంజాయికి అలవాటుపడ్డ కొందరు యువకులు చెట్ల పొదలు, చెట్ల పైన కుండీలు పెట్టి మరీ గంజాయి మొక్కలు పెంచుతున్నారు. ఇటీవల సాయినగర్ కాలనీకి ఆనుకుని ఉన్న ఓ వెంచర్‌లో ఉన్న చెట్టుపై కుండీలు అమర్చి గంజాయి మొక్కలు పెంచారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇలా చేస్తున్నారు.

బోథ్‌కు చెందిన ఓ యువకుడు గుట్టుచప్పుడు కాకుండా పలువురికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ షాపు నడుపుతున్న ఆ యువకుడికి పల్లెల నుంచి గంజాయి తీసుకువస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి కుమారుడు సైతం గంజాయికి అలవాటుపడినట్లు తెలుస్తోంది.

2022 డిసెంబర్ 28న ఆదిలాబాద్‌లోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో గంజాయిని విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. హైదరాబాద్‌లో తన స్నేహితులకు గంజాయిని తీసుకువచ్చేందుకు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మరో యువకుడి వద్ద గంజాయిని తీసుకున్నాడు. వారం పాటు హైదరాబాద్‌లో గంజాయి విక్రయించాడు. ఈ క్రమంలో ఎక్సైజ్ అధికారులు పట్టుకుని, అతని వద్ద నుంచి 1.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



- చెట్లపొదల్లో మొక్కల పెంపకం
- హైదరాబాద్‌లోని పబ్‌లకు చేరవేస్తూ..
- ఇటీవల విక్రయిస్తూ పట్టుబడ్డ ఆదిలాబాద్ యువకుడు
- వాచ్‌మెన్‌లుగా పనిచేస్తూ విక్రయాలు

బోథ్: జిల్లా వ్యాప్తంగా గంజాయి యథేచ్ఛగా సరఫరా అవుతోంది. చాలా గ్రామాల్లోని యువతకు గంజాయి సులభంగా చేరుతోంది. 10వ తరగతి మొదలుకుని విద్యార్థులు, యువకులతోపాటు పలువురు గంజాయికి బానిసలవుతున్నారు. మండల కేంద్రంలోని కల్లుబట్టీ వద్ద, రాత్రి వేళల్లో స్థానిక పాత ప్రభుత్వ కళాశాల భవనం, జూనియర్ కళాశాల, పిప్పల్‌ధరి రోడ్డు, పెద్ద వాగు సమీపాన, మోడల్ స్కూల్ వెనుక భాగం, పలు వెంచర్లల్లో గంజాయిని సేవిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇతర ప్రాంతాలకు సరఫరా..

ఆదిలాబాద్ జిల్లాలో కొందరు యువకులు గంజాయిని హైదరాబాద్, ముంబయి ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. బ్యాగుల్లో గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్తున్నారు. బ్యాగుల నుంచి వాసన రాకుండా సెంట్ కొడుతున్నారు. అనుమానం రాకుండా ఒక వారం బస్సు, మరోవారం కారులో వెళ్తున్నారు. ఒక వారం నిర్మల్ నుంచి హైదరాబాద్‌కి వెళ్తే మరో వారం ఆదిలాబాద్‌లో బస్సు ఎక్కుతున్నారు. అటు ప్రైవేట్ బస్సుల్లోనూ వెళ్తున్నారు. మరోవైపు ముంబయికి ప్రత్యేకంగా కార్లలో గంజాయిని తీసుకెళ్తున్నారు. అక్కడ ఉన్న వాచ్‌మెన్‌లుగా, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వ్యక్తులకు గంజాయిని చేరవేసి ఇంటికి తిరుగుపయనమవుతున్నారు. ప్రతి వారం గంజాయి సరఫరా కొనసాగుతోంది. హైదరాబాద్‌లో ఉంటున్న వారు గంజాయిని తీసుకుచ్చే యువకులు వారానికి రూ.4 వేలు ఇస్తున్నారు. ఈ తతంగం గత కొన్నేళ్లుగా సాగుతోంది. గంజాయిని రవాణా చేసే వాళ్లలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులే ఉండటం ఆందోళన కల్గిస్తోంది.

వాచ్‌మెన్‌లుగా పనిచేస్తూ..

జిల్లాలోని నేరడిగొండ, బోథ్, బజార్‌హత్నూర్, సిరికొండ, గుడిహత్నూర్ మండలాలు, ఇతరచోట్ల నుంచి యువకులు హైదరాబాద్‌లోని అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. వీరంతా 18 నుంచి 35 ఏళ్లలోపు యువకులే. అక్కడ ఉద్యోగాలు చేస్తూ పబ్‌ల్లో ఉండే ఏజెంట్లతో గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. తమ పల్లెల్లో అంతరపంటగా సాగు చేస్తూ వారి బంధువులు, స్నేహితుల ద్వారా ఇతర ప్రాంతాలకు తెప్పించుకుంటున్నారు. వీటి ద్వారా వచ్చే డబ్బుతో జల్సాలు చేస్తూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

జిల్లాలో ఇప్పటివరకు పట్టుబడ్డ గంజాయి కేసులు

సంవత్సరం	నమోదైన కేసులు	అరెస్టయినవారు
2020	12	31
2021	13	30
2022–23	14	17

కొన్ని ఘటనలు..

- గతంలో బోథ్ మండలంలోని ఓ గ్రామంలో హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు గంజాయిని కొనుగోలు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.
- గత 18 నెలల క్రితం బోథ్ మండలం పట్నాపూర్‌లో 109 గంజాయి మొక్కలు పట్టుకుని ధ్వంసం చేశారు.
- బోథ్ మండలం పార్డి(కె) గ్రామంలో 2 కిలోల డ్రై గంజాయిని పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదైంది.
- గతేడాది బజార్‌హత్నూర్ మండలంలోని మంజీరతండాలో 7 కిలోల గంజాయిని పట్టుకున్నారు.
- నేరడిగొండ మండలం కుప్టిలో ఆటోలో తరలిస్తున్న 2 కిలోల గంజాయిని పట్టుకున్నారు.
- గత జూన్ 19న ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద 500 గ్రాముల పొడి గంజాయిని పట్టుకున్నారు.

భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు



యువకులు గంజాయికి అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. ఎవరైనా గంజాయిని అక్రమంగా తరలించినా.. సాగు చేసినా వారిపై కేసులు నమోదు చేస్తాం. యువకులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతాం. గంజాయి రవాణాపై నిఘా పెంచాం. గంజాయి మొక్కలు పెంచితే కేసులు నమోదు చేస్తాం. – భీమేశ్, సీఐ, బోథ్

బావిలో పడి వృద్ధురాలి మృతి



రాజవ్వ మృతదేహం

కడెం: ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై భీంరావు కథనం ప్రకారం.. మండలంలోని లింగాపూర్‌కు చెందిన బోయిని రాజవ్వ (80) ఆదివారం తెల్లవారుజాము కాలకృత్యాలకని నిద్రలేచింది. ఇంటి పక్కనే ఉన్న బావిలో నుంచి నీటిని చేదే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. కుమారుడు వెంకట్రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు..



శ్రీనివాస్ (ఫైల్)

లోకేశ్వరం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతిచెందాడు. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పోతరాజు శ్రీనివాస్(38) శనివారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు పోచమ్మ చెరువు వద్దకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోయేసరికి ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. చెరువు వద్దకు వెళ్లగా ఆయన అనవాళ్లు కనిపించాయి. ఆదివారం ఉదయం మృతదేహం లభ్యమైంది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు ఒకరు..

గుడిహత్నూర్: మండలంలోని ముత్నూరు గ్రామానికి చెందిన పైతనే గౌతమ్ (55) పాముకాటుకు గురై మృతిచెందాడు. శనివారం ఉదయం ఇంటి పెరట్లో గడ్డి తీస్తుండగా గౌతమ్‌కు పాము కాటేసింది. దీంతో ఆయన నాటు వైద్యం తీసుకున్నాడు. ఎంతకీ నయం కాకపోవడంతో కుటుంబీకులు మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి 10:30 గంటల సమయంలో మృతి చెందినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సోనేరావుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు, తదితరులు

ఆదిలాబాద్‌రూరల్: కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద ఆదివారం రాస్తారోకో చేపట్టారు. దాడి చేసిన వారిని అరెస్టు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. పలువురు కొలాం సంఘం నేతలు మాట్లాడుతూ సోనేరావుపై దాడిని ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ తెగలపై ఆధిపత్యం కోసం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నాయకులు మిగతా తెగలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కొన్ని తెగలకు రక్షణ లేకుండా చేస్తూ ఆదివాసీల హక్కులు కాలరాస్తున్నా తుడుందెబ్బను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పొచ్చయ్యలు వెంటనే సోనేరావ్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే కొలాం సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీంరావ్, గౌరవ అధ్యక్షుడు టేకం భాస్కర్, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావ్, నాయకులు బాలేరావ్, లక్ష్మణ్, రాజు, లక్ష్మీబాయి, రాధబాయి, ముకుంద్‌రావ్, గణేశ్ పాల్గొన్నారు.

తుడుందెబ్బ జిల్లా కమిటీ రద్దు చేయాలని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

నార్నూర్: తుడుందెబ్బ జిల్లా కమిటీని వెంటనే రద్దు చేయాలని ఆదివాసీలు ఆందోళనకు దిగారు. గాదిగూడ మండలం లోకారి(కే) గ్రామంలోని కుమురం భీం చౌక్ వద్ద ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ఎంపీ సోయం బాపూరావు దిష్టిబొమ్మ దహనం చేయడం సిగ్గుచేటన్నారు. కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావుపై కొందరు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఆదివాసీ సమాజంలో రాయి సెంటర్, గ్రామ పటేల్ వ్యవస్థలు పటిష్ఠంగా ఉందన్నారు. ఏదైనా అంతర్గత విభేదాలు ఉంటే కూర్చుని మాట్లాడుకొని సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ఝరి రాయి సెంటర్ సార్‌మేడి మండాడి దౌలత్‌రావు, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు పూసం బాదిరావు, కొలాం సంఘం మండల అధ్యక్షుడు కొడప కాను, గ్రామ పటేల్ మెస్రం సోము, డాబా పటేల్ కుమ్ర పైకు, విద్యార్థి నాయకుడు పెందూర్ సంతోష్ ఉన్నారు.

ఫుట్‌బాల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి మెన్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా ప్రతిభ కనబరచిన 20 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 16 నుండి 20 వరకు వనపర్తి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు పాల్గొంటుందని ఆయన పేర్కొన్నారు.

‘బీసీ గర్జన పేరిట కాంగ్రెస్ మోసం’

జన్నారం: ఇంతకాలం బీసీలను పట్టించుకోని కాంగ్రెస్ బీసీ గర్జన పేరిట బీసీలను మోసం చేయడానికి మరోసారి కుట్ర పన్నుతోందని బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నిర్వహిస్తున్న బీసీ గర్జన కార్యక్రమాన్ని సమితి బహిష్కరిస్తుందన్నారు. 75 సంవత్సరాల కాలంలో ఏనాడు బీసీలను పట్టించుకోని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో బీసీ భజన చేయడం విడ్డూరమన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే విషయంలో కాంగ్రెస్ మాట్లాడక పోవడం సరికాదన్నారు. సమావేశంలో గంగాధర్, భాస్కర్ గౌడ్, శ్రీనివాసగౌడ్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

పోషకాల గని డ్రాగన్ ఫ్రూట్

- సాగుకు ముందుకొచ్చిన ప్రభుత్వ టీచర్
- కరోనా, లాక్‌డౌన్‌లో యూట్యూబ్‌లో అధ్యయనం
- 1.25 ఎకరాల్లో రూ.8 లక్షల ఖర్చుతో సాగు
- ఒక్కో మొక్కకు రూ.100 చెల్లింపు



డ్రాగన్ ఫ్రూట్

జైనథ్: సంప్రదాయ పంటలకు విసిగిపోయిన ప్రభుత్వ టీచర్..విదేశాల్లో పండిస్తున్న డ్రాగన్ ఫ్రూట్‌తో ఆదాయం పొందాలని దీన్ని సాగుకు శ్రీకారం చుట్టాడు. అతనే ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కౌఠ గ్రామానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు భోయర్ ప్రశాంత్. డ్రాగన్ ఫ్రూట్‌లో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు ఉండడంతో సాగు చేసి లాభాలు గడిస్తున్నాడు. కరోనా, లాక్‌డౌన్‌లో దీని గురించి యూట్యూబ్, ఇతర మాధ్యమాల విస్తృతంగా అధ్యయనం చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, మహారాష్ట్రలోని సోలాపూర్ నుంచి ఒక్కొక్క మొక్కకు రూ.100 నుంచి 150 చెల్లించి మొత్తం రూ.3 లక్షలతో జంబో, మారథాన్ రెడ్, అమెరికన్ జ్యూసీ వెరైటీలకు చెందిన 2400 మొక్కలు తెప్పించి కౌఠ గ్రామంలోని తన చేనులో 1.25 ఎకరాల్లో నాటాడు. మొత్తం పంట కోసం ఇప్పటివరకు రూ.8లక్షలు ఖర్చు చేయగా, ప్రస్తుతం కాత ప్రారంభం కావడంతో మంచి దిగుబడులు వస్తున్నాయి.

ఏడాదిలో ఆరు నెలలు కాతనే..

తక్కువ శ్రమతో దీర్ఘకాలంపాటు అధిక లాభాలు తెచ్చిపెట్టే డ్రాగన్ ఫ్రూట్ సాగుకు భోయర్ ప్రశాంత్ ముందుకొచ్చాడు. ఒక్కసారి పంట వేస్తే 25 ఏళ్లపాటు, ఏడాదికి ఆరు నెలలు కాత వస్తుంది. అనుకున్నట్లే ఏడాది తర్వాత కాత ప్రారంభమైంది. ఇప్పటికే 200 కిలోల పండ్లు కోత కోయగా స్థానికంగా మార్కెట్‌లో కిలో రూ.150–160 ధర పలికింది. దీనికి తోడు ఆర్గానిక్ సాగు చేయడంతో మంచి ఆదరణ లభిస్తోంది. మొదటి కాత కావడంతో ఒక్కొక్క ఫ్రూట్ అర కిలో వరకు సైజ్‌లో వస్తోంది. ఈ ఏడాది మొత్తం దాదాపు ఒక టన్ను దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి 5–8 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని ప్రశాంత్ చెబుతున్నారు. ఈ పంటకు వర్మీ కంపోస్ట్, జీవామృతం సేంద్రియ ఎరువులతోపాటు చాలా తక్కువ ధరకు లభించే ట్రైకోడెర్మా, సూడోమోనస్ వంటి శిలీంధ్రాలను పంటకు ఎరువుగా వేయాలి. ఏడాదికి రూ.50వేలు మాత్రమే ఖర్చవుతాయని చెబుతున్నాడు.

డ్రాగన్ ఫ్రూట్‌కు డిమాండ్



మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్ కిలో రూ.200 వరకు ఉంది. కిలో రెండు మాత్రమే వస్తాయి. ఈ ఫ్రూట్ పండిస్తే రైతులు మంచి లాభాలు ఆర్జించవచ్చు. ఎకరాకు రూ.6–7లక్షలు పెట్టుబడి పెడితే దాదాపు 25 ఏళ్లపాటు కాత వస్తుంది. డ్రాగన్ ఫ్రూట్‌లకు చాలా డిమాండ్ ఉండటంతో మొదటి రెండేళ్లల్లో పెట్టుబడి తిరిగి వస్తుంది. ఈ ఏడాది నా చేన్లో ఒక టన్ను దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నా. జిల్లాలో మొదటగా నేనే సాగు చేశా. ప్రస్తుతం అక్కడక్కడ డ్రాగన్ ఫ్రూట్ సాగు మొదలైంది.

– భోయర్ ప్రశాంత్

రిమ్స్‌లో అట్టహాసంగా గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లు అందజేస్తున్న రిమ్స్ డైరెక్టర్

- ఎంబీబీఎస్ పూర్తి చేసిన మెడికోలకు సర్టిఫికెట్ల ప్రదానం

ఆదిలాబాద్: రిమ్స్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే అట్టహాసంగా జరిగింది. మెడికోల కేరింతలు, చప్పట్ల మధ్య రిమ్స్‌లో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఇటీవల వాగులోపడి మృతి చెందిన పీజీ వైద్యవిద్యార్థి బుక్య ప్రవీణ్ కుమార్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. అనంతరం వైద్యకోర్సు పూర్తి చేసిన 2017 బ్యాచ్ మెడికో విద్యార్థులకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుడిగా మంచి గుర్తింపు తెచ్చుకొని పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం పట్టాలు పొందిన మెడికోలు వైద్యవృత్తికి న్యాయం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇద్రిస్ అక్బాని, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విద్యవిల్సన్, ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, వైద్యులు, మెడికోలు తదితరులు పాల్గొన్నారు.

కూలిన కంపెనీ క్వార్టర్ పైకప్పు

- తృటిలో తప్పిన ప్రమాదం



కూలిన పైకప్పు

రామకృష్ణాపూర్(చెన్నూర్): బీజోన్ ఏరియాలోని సింగరేణి బీ–21 క్వార్టర్స్‌లో ఉన్నట్టుండి ఒక్కసారిగా పైకప్పు కూలింది. ఆర్కే ఓసీలో అండర్ మేనేజర్‌గా పనిచేస్తున్న రవికిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాగా ఈ క్వార్టర్‌లోని బెడ్ రూంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. అప్పటివరకు అదే గదిలో ఉన్న కుటుంబసభ్యులు అప్పుడే వేరే గదికి వెళ్లడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. గదిలోని కంప్యూటర్‌తోపాటు ఇతర సామగ్రి ధ్వంసమైంది. విషయం తెలిసిన వెంటనే ఏరియా జీఎం మోహన్‌రెడ్డి, ఇతర సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులు క్వార్టర్‌ను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.